

బాపూనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

అంబర్‌పేట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో సుమారు రూ.26 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని, పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే బాపూనగర్‌లో పాదయాత్ర నిర్వహించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు ఔట్‌లుక్ బిజినెస్ అవార్డు



డాక్టర్ శ్రీనివాసరావుకు అవార్డును అందజేస్తున్న ఔట్‌లుక్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావుకు ఔట్‌లుక్ బిజినెస్ అవార్డు లభించింది. విద్యారంగంలో సమర్థవంతమైన వ్యక్తులకు ఇచ్చే ఈ అవార్డును గురువారం నగరంలోని హోటల్ షెరటాన్‌లో జరిగిన ఎడ్‌టెక్ సదస్సులో ఔట్‌లుక్ బిజినెస్ ఎడిటర్ సుచేతన రాయ్, కన్వర్జెన్స్ హెడ్ సయంతన్‌దాస్ గుప్త చేతుల మీదుగా డాక్టర్ శ్రీనివాసరావు అందుకున్నారు. తనను ఔట్‌లుక్ బిజినెస్ అవార్డుకు ఎంపిక చేసిన ప్రతినిధులకు, సహకరించిన కళాశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న 5 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో బీసీ సంఘాల నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు బకాయిల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించామన్నారు. తమ డిమాండ్లపై మంత్రి భట్టి సానుకూలంగా స్పందించి విద్యార్థుల ఫీజుబకాయిల విడుదలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

'రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రూపాయలు 5 వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. విదేశీ విద్యానిధి పథకాన్ని రెడ్డి సామాజికవర్గానికి వర్తింపచేయాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాలలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని, తహసీల్దార్ కార్యాలయాలలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంజీవరెడ్డి, వేంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, హరినాథ్‌రెడ్డి, వసంతరెడ్డి, నర్సింహరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ మెట్రో స్టేషన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మెట్రోలో ప్రయాణించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్వే శాఖ చేపట్టిన 'మెట్రో జాయ్ రైడ్' కార్యక్రమంలో భాగంగా గురువారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను మెట్రోరైల్లో ఉచితంగా జేబీఎస్ స్టాప్ వరకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఎల్అండ్‌టీ మెట్రో రైలు ఉన్నతాధికారి మురళి వరదరాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా మెట్రో రైల్లో ప్రయాణించారు. మెట్రోలో ప్రయాణం మంచి అనుభూతిని కలిగించిందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్ యాదవ్, స్కూల్ కార్యదర్శి రత్నం తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ జి.చిన్నారెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలపిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, ప్రధానకార్యదర్శి కృపాకర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రామచంద్రరావు, చంద్రశేఖర్, మానస తదితరులు

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

రాచకొండలో 14 మంది ఇన్‌స్పెక్టర్లు మల్టీజోన్‌కు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్‌లో పనిచేస్తున్న 14 మంది ఇన్‌స్పెక్టర్లను మల్టీజోన్ 2కు అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి గురువారం ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి వీసీఆర్ ఆర్. నిరంజన్, కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎం.మహేష్, ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ జి.గోవర్ధనగిరి, కుషాయిగూడ డీఐ బి. సాయిప్రకాష్‌గౌడ్, వనస్థలిపురం డీఐ బి. వెంకటయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ 1 ఎల్. బాలుచౌహాన్, కుషాయిగూడ ట్రాఫిక్ పి.రఘువీర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్.సైదులు, ఎస్‌ఓటీ 2 ఈ. జంగయ్య, పి. సైదులు, సీసీఎస్ ఎల్బీనగర్ ఎన్. జయరాం, కె. సత్యనారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ టి. కిరణ్‌కుమార్ మల్టీజోన్ 2 ఐజీపీకి వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

'ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ ప్రకటించాలి'

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 2013 పీఆర్‌సీ బాండ్స్ ఏరియర్స్ 50 శాతం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, 2017 పీఆర్‌సీ 30శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. డిపోల్లో సంక్షేమ మండళ్లను రద్దు చేసి యూనియన్‌ల కార్యకలాపాలకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

ముషీరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో మెట్రో రైలుస్టేషన్ కిందిభాగంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పైప్‌లైన్ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. అరకిలోమీటరు వరకు ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రూ.3కోట్ల 60లక్షలతో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ డివిజన్ కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, జలమండలి జీఎం రామకృష్ణ, డీజీఎం మోహన్‌రాజులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 15 రోజుల్లో పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహా, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్పొరేటర్ల దుష్ప్రచారం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నామని బీజేపీ కార్పొరేటర్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ముఠాగోపాల్ విమర్శించారు. కేవలం ఒక బోరింగ్ వేసి బీజేపీ నాయకులు ఆర్భాటం చేస్తున్నారని అన్నారు. కోట్లాది రూపాయలను మంజూరు చేయించి అనేక సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా బీజేపీ కార్పొరేటర్లు అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.



తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సమితి గౌరవ అధ్యక్షుడు ఎర్రోజు శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు రూబీన్ స్టీవెన్సన్, వెంకన్న తదితరులు

ఎఫ్ఐఆర్‌తో ప్రమేయం లేకుండా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులను ఎఫ్ఐఆర్‌తో ప్రమేయం లేకుండా ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి గౌరవ అధ్యక్షుడు ఎర్రోజు శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు రూబీన్ స్టీవెన్సన్, వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు ప్రత్యేక కోటా కేటాయించాలని, ప్రత్యేక సంక్షేమ నిధి, తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి రాంచందర్ గౌడ్, నాయకులు మాణిక్‌ప్రభుగౌడ్, రమేష్, సుధాకర్, నాగేశ్వరరావు, ఆర్.అర్జున్‌రావు, యశ్‌పాల్, కరుణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర గొప్పది

చిక్కడపల్లి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో స్వచ్ఛందసంస్థల పాత్ర గొప్పదని లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ శతాబ్ది అధ్యక్ష, కార్యదర్శులు విజయలక్ష్మీ, లక్ష్మి అన్నారు. చిక్కడపల్లి ప్రభుత్వ పాఠశాలలో గురువారం పిల్లలకు తాగునీటి బాటిల్స్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్మాణం, నోటు పుస్తకాల పంపిణీ, గ్రంథాలయ ఏర్పాటువంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



నల్లకుంట డివిజన్ టీఆర్‌టీ నివాసి, బీజేపీ సీనియర్ నాయకుడు ఆది నాగేష్ పరమపదించిన నేపథ్యంలో గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీజేపీ నాయకులు ఎం.శ్యామ్‌రాజ్, రమేష్‌యాదవ్, బుచ్చిరెడ్డి, నర్సింగ్ రావు, మహేష్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

'ఆరుగ్యారెంటీల అమలుకు ప్రభుత్వం చర్యలు'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుదని నగర మహిళా కాంగ్రెస్ నాయకురాలు చంద్రకళశంకర్ అన్నారు. రెండు వందల యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూపాయలకే గ్యాస్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా గురువారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీలో మహిళలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళలు, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శంకర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, రమేష్, మీనా, లావణ్య, రోజా, సరిత, భాస్కర్‌రెడ్డి, భాగ్యమ్మ, దినేష్ పాల్గొన్నారు.



అంతర్జాతీయ టైలర్స్ డేను పురస్కరించుకుని సేవాయూత్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది మహిళా టైలర్లను సన్మానించారు. కార్యక్రమంలో అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ అశోక్, న్యాయవాది నర్సింహారావు పాల్గొన్నారు

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

ముషీరాబాద్ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కవిత

రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలిగా గజ్జెల కవిత, కవాడిగూడ డివిజన్ అధ్యక్షురాలిగా సునీత, ఉపాధ్యక్షురాలిగా అనురాధ నియమితులయ్యారు. వీరి నియామకాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్ కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పుస్తకాల కవితలు గురువారం ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు.



అంబర్‌పేట డ్రీమ్స్ కిడ్స్ స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

5 నుంచి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మార్చి 5 నుంచి 12వ తేదీ వరకు కొనసాగుతుందని సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా కనీసం పదేళ్ల పనిచేసిన సర్వీస్ ఆధారాలతోపాటు ప్రస్తుతం జర్నలిస్టుగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం (ఐడీ కార్డు, అక్రిడిటేషన్ కార్డు లేదా సంస్థ నుంచి అపాయింట్‌మెంట్ లెటర్)తో పాటు స్థానిక నివాస ధ్రువీకరణ (ఆధార్ కార్డు లేదా గ్యాస్ బిల్, కరెంట్ బిల్లు), రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తు ఫారానికి జత చేయాలని పేర్కొన్నారు. వీటితోపాటు ది గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేదా గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ పేరిట రూ.1050 బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) తీసి దరఖాస్తు ఫారానికి జతచేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న టీవీ కాలనీ ఫేస్- 4, ప్లాట్ నంబర్ 198లో గల సొసైటీ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు లభిస్తాయని తెలిపారు అర్హులైన జర్నలిస్టులు సభ్యత్వానికి కావాల్సిన సర్వీస్ ఆధారాలు, డీడీ తీసుకుని వచ్చి దరఖాస్తు నింపి సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9100933723, 9393353519లలో సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

బిర్యానీ.. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెచప్పుడు: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ ప్యాకెట్ చిన్నదే కానీ అది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడుగా మారింది.. అదే తరహాలో ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం నానక్‌రామ్‌గూడాలోని ఓ ప్రైవేట్ హోటల్లో అవుట్ లుక్ బిజినెస్ స్పాట్ లైట్ సమర్పించిన ఇండో గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు 2024 పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి 600 మిలియన్ ఉద్యోగాలు అవసరమని అంచనాలు ఉన్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో ప్రతి పది ఉద్యోగాల్లో ఏడు ఉద్యోగాలు ఎంఎస్‌ఎంఈల నుంచే లభిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ వ్యాపారంలో ఎంఎస్‌ఎంఈలు 90% వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమలు ఉపాధి, జీడీపీ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడుతున్నాయని, జీవనోపాదులపై ఆధారపడిన శ్రామిక, పేద మహిళలు, యువత, బలహీన వర్గాలకు ఈ తరహా పరిశ్రమలు చేయూతనందిస్తున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 20 మందికి ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన నగర కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాస్‌రెడ్డిని ప్రముఖ సంఘసేవకుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలోని ఓ ప్రతినిధి బృందం గురువారం కలిసి ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

యువతి అదృశ్యం



నాగేశ్వరి

అంబర్‌పేట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉంటున్న ఓ యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట బాపూనగర్‌లో నివాసం ఉండే చలమల భాగ్యకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా కుమారుడు శివ, కుమార్తె నాగేశ్వరి (19) ఆమెతో కలిసి ఉంటున్నారు. నాగేశ్వరి డీమార్ట్‌లో పనిచేసేది. నాగేశ్వరికి ఇటీవల వివాహం కుదిరింది. దీంతో నాగేశ్వరి డీమార్ట్‌లో ఉద్యోగం మానేసి ఇంట్లో ఉంటుంది. ఫిబ్రవరి 14న భాగ్య తన పెద్దకుమార్తె వద్దకు వెళ్లింది. 15న తిరిగి ఇంటికి వచ్చేసరికి చిన్నకుమార్తె నాగేశ్వరి ఇంట్లో కనిపించలేదు. ఆమె ఆచూకీ ఎంత వెతికినా లభించలేదు. దీంతో భాగ్య అంబర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ ఎంపీ వీహెచ్ తదితరులు

మహంకాళి దేవాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో గురువారం ఉదయం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు బి.పద్మా వెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అమృత, మాజీ కార్పొరేటర్లు హజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహంకాళి దేవాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవాసమితి చీఫ్ అడ్వయిజర్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, వైస్‌చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

బాలల క్లబ్‌లను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలల క్లబ్‌లను ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసి వారి హక్కులను కాపాడేందుకు ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మానవ హక్కుల క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు రాము పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను కలిసి బాలల క్లబ్‌లను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మానవ హక్కుల క్లబ్ ఉపాధ్యక్షులు నీలిమ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు



సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని శ్రీగురుదత్త హైస్కూల్‌లో గురువారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ విశ్వజిత్ భరత్, వై.శర్మసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, సైన్స్ టీచర్లు రేణుక, పల్లవి, శిరీష పాల్గొన్నారు.

నేడు ముషీరాబాద్‌లో బీజేపీ విజయ సంకల్పయాత్ర

ముషీరాబాద్, రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు చేపట్టిన బీజేపీ విజయసంకల్పయాత్ర శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు ముషీరాబాద్ చౌరస్తా నుంచి ప్రారంభించనున్నట్లు బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం గురువారం తెలిపారు. ఈ యాత్రకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు రాంనగర్ చౌరస్తాలో 10వేల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మార్చి 2న విజయ సంకల్ప యాత్ర ముగింపు సభ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయ సంకల్ప యాత్ర ముగింపు సభ మార్చి 2న అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు తెలిపారు. గురువారం బర్కత్‌పుర నగర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ సభ ప్రారంభమవుతుందని తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ ఎంపీ బండి సంజయ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల పేరుతో కార్మికశాఖలో బదిలీలు చేపట్టడం సరికాదు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పేరుతో కార్మికశాఖలో బదిలీలు చేపట్టడం సరికాదని సీఐటీయు నేత రాజయ్య అన్నారు. గురువారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. ఈనెల 27న ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆర్డర్ ప్రకారం కార్మికశాఖలో డీసీఎల్, ఎఎల్‌వోల బదిలీలను నిలిపివేసి ఏసీఎల్‌లను బదిలీ చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా జారీచేసిన బదిలీల ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు.

10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



రాజాపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులకు సన్మానం

నల్లకుంట, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి పీ.వీ.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించిన నేపథ్యంలో పీవీ కుటుంబ సభ్యులకు మార్చి 3న ఉదయం 9 గంటలకు రవీంద్రభారతిలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక నాయకుడు శ్రీనివాస్‌రావు వెల్లడించారు. గురువారం నల్లకుంటలోని బ్రాహ్మణసంఘం జేఏసీ కార్యాలయం వద్ద కార్యక్రమ ఆహ్వానపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర సలహాదారు వేణుగోపాల్‌లు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక నాయకులు రమణారావు, రాఘవరావు, రంగారావు, లక్ష్మీనరసింహారావు, సునీల్, దేశ్‌ముఖ్, రామారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

రాంనగర్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎన్.యాదగిరిరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. రాజకీయాల్లో, చలనచిత్ర రంగంలో ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తించి భారతరత్న ఇవ్వాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.